చిందరవందర అయిన బీరువాలోని వస్తువులు, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

జనగామ పట్టణంలో చోరీ

- ఇంటి తాళాలు పగులగొట్టి రూ.5లక్షల నగదు, 4తులాల బంగారు, వెండి ఆభరణాలు అపహరణ
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి క్లూస్ టీం

జనగామ చౌరస్తా, మే 19 : జిల్లా కేంద్రంలోని గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో నివాసం ఉంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి బొల్లపల్లి వెంకటేశ్-లక్ష్మి దంపతుల ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో నివాసముంటున్న బొల్లపల్లి వెంకటేశ్ వారం రోజుల క్రితం తన భార్య లక్ష్మికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్యచికిత్సనిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చేర్పించారు. వారం రోజుల నుంచి అక్కడే ఉంటున్న వెంకటేశ్ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఇంటికి వేసిన తాళంతో పాటు లోపలి బీరువా లాకర్ పగులగొట్టి ఉండడాన్ని వెంకటేశ్ గమనించాడు. తమ ఇద్దరు కూతుర్ల పెళ్లి కోసం వెంకటేశ్-లక్ష్మి దంపతులు దాచుకున్న రూ.5 లక్షల నగదు, 4 తులాల బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే బాధితుడు డయల్ 100 ద్వారా సమాచారం తెలుపడంతో క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఇక ముందు ప్రజలు ఎవరైనా తమ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ఇంటికి తాళం వేసిన విషయాన్ని తమ పొరుగింటి వారికితోపాటు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కేయూ హాస్టల్స్ సందర్శించిన డైరెక్టర్ సమ్మయ్య

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డైరెక్టర్ సమ్మయ్య

హనుమకొండ చౌరస్తా, మే 19: హాస్టల్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆదివారం కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టళ్లను సందర్శించి భోజన సౌకర్యం, హాస్టల్ సౌకర్యాలను పరిశీలించారు. వెంటనే కామన్ మెస్ సందర్శించి విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ హాస్టల్ వసతులు, భోజన నాణ్యత గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో నాణ్యతలేని టమాటాలు, అల్లంను తిరస్కరించి నాణ్యతగల కూరగాయలు, పాలు, పెరుగు, గుడ్లు, చికెన్ తదితరాలు నాణ్యమైనవి సరఫరా చేయాలన్నారు. ఆర్ట్స్ కాలేజీ సమీపంలో ఉన్నలా హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో హాస్టల్ వసతులు, భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఉన్నా అడ్మిని స్ట్రేషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, మే 19: వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ బాలుర ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ తెలిపారు. అభ్యర్థులు జూన్ 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ప్రాధాన్యతాక్రమంలో ట్రేడ్స్ ఐటీఐలో ఎంపిక చేసుకోవాలని http://iti.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 14 ఏళ్లు కలిగిన వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, అభ్యర్థులు మనుగడలో ఉన్న సెల్ నంబర్ మాత్రమే ఇవ్వాలని, కోర్సు పూర్తయ్యేంత వరకు అదే సెల్ నంబర్‌కు సమాచారం పంపించనున్నట్లు వివరించారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పబ్బా జగదీశ్వరయ్య, తండ్రి: వెంకటయ్య, నివాసం : ఇంటి నెం. 402, కార్నే ఇన్ గార్డెన్ సిటి ఫేజ్-2, దాద్రా నగర్ హవేలి, గుజరాత్. ఇతను చనిపోయినాడు. ఇతని ఆస్తి సర్వే నెం. 155, ప్లాట్ నెం. 24, విస్తీర్ణం 300 చ.గజములు (లేదా) 250.83 చ.మీటర్లు, తాయంపేట గ్రామం, భాజీపేట మండలం, హనుమకొండ జిల్లా పరిధిలో గలది దీనికి గల హద్దులు : తూర్పున 30 ఫీట్ల రోడ్డు, పడమర : ఇతరుల భూమి, ఉత్తరం: 30 ఫీట్ల రోడ్డు ; దక్షిణం : వేణుగోపాల్‌రెడ్డి గారి భూమి. ఇట్టి భూమికి హక్కుదారుడైన అతని కుమారుడు పబ్బా రాజ్‌కుమార్, తండ్రి: పబ్బా జగదీశ్వరయ్య.

ఇట్టి భూమిని ప్రస్తుతం కొనుగోలు చేసినవారు వడ్లపల్లి విక్రం, తండ్రి : చంద్రమౌళి, వయస్సు: 39 సం.లు, వృత్తి : రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, నివాసం: నాచినపల్లి గ్రామం, నర్సంపేట మండలం, వరంగల్ జిల్లా.

పైన తెలిపిన భూమి విషయంలో ఎవరికైన ఏమైన అభ్యంతరములు ఉన్నచో క్రింది అడ్రస్ వారికి తెలుపగలరు.

ఇట్లు
ఆర్. గిరి
అడ్వకేట్
సెల్ : 9390801888

పాలకుర్తి : గూడూరులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ చౌరస్తా : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

వర్ధంతి సభల్లో సీపీఎం నాయకులు

జనగామ చౌరస్తా, మే 19 : పీడిత జన హృదయ నేత దివంగత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో సుందరయ్య అగ్రభాగాన నిలిచినట్లు తెలిపారు. ప్రజాధనం వృథా చేయకుండా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని పేర్కొన్నారు. పేదల పక్షపాతిగా ఉంటూ ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేస్తూ నిరాడంబర జీవితం గడిపిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, పట్టణ కమిటీ నాయకులు జోగు ప్రకాశ్, మంగ వీరయ్య, పందిళ్ల కల్యాణి, మహేందర్, మల్లేశ్, అంజయ్య, సుభాషిని, అంజమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, ఎల్లమ్మ, రజిత, ఆనందం, యాకస్వామి, సోమనాథ్, అంజయ్య, శ్రీను, రాములు, మణి, బాలమణి, కవిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకుర్తిలో..

పాలకుర్తి : కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శనీయమని సీపీఎం నాయకులు అన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని విస్తరింప చేయడంలో ఆయన కృషి అనిర్వచనీయమని పేర్కొన్నారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గూడూరులో సీపీఎం నాయకులు సభ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య మాట్లాడారు. సుందరయ్య ఉన్నత వర్గంలో జన్మించినా తన జీవితాన్ని పేదల హక్కుల పరిరక్షణ కోసం త్యాగం చేశారని తెలిపారు. దున్నేవారికే భూమి కావాలనే నినాదంలో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమసత్యం, బెల్లి సంపత్, పనికిర భాస్కర్, రాజు, మామిడాల సోమన్న, మల్లేశ్, కొమురయ్య, శ్రీను, కుమార్, లింగయ్య పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చనపేట : అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పేదలకు ఇళ్ల స్థలాలు సాధించుకుంటామని సీపీఎం మండల నాయకుడు పర్వతం నర్సింహులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఇందులో సుందరయ్య నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. నాయకులు భాగ్యలక్ష్మి, గాయత్రి, ఎల్లమ్మ, కృష్ణవేణి, లక్ష్మి, జ్యోతి, బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

జనగామ చౌరస్తా, మే 19 : రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన ఆదివారం జనగామ పట్టణంలోని బస్టాండ్ వద్ద జరిగిందని అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద పహాడ్ గ్రామానికి చెందిన అల్వాల రాజమ్మ (71) ఆదివారం సాయంత్రం జనగామ పట్టణంలోని శ్రీరాం హోటల్‌లో టీ తాగింది. అనంతరం బస్టాండ్ లోపలికి వెళ్లడానికి రోడ్డుదాటుతున్నది. ఈ క్రమంలో టీఎస్ 27 ఈ 5393 నంబరు గల బైక్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా వస్తున్న మహ్మద్ అమీర్ సోహెల్ రోడ్డు దాటుతున్న రాజమ్మను ఢీకొట్టాడు. రాజమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను వెంటనే 108అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. మృతురాలి కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోహెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత

బచ్చన్నపేట మే 19 : మండలంలోని చిన్నరామన్‌చర్లకు చెందిన పలువురు ఇటీవల కురిసిన గాలివానకు ఇండ్ల రేకులు లేచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జంగిటి విద్యానాథ్ బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి 25కిలోల చొప్పున మొత్తం 10కుటుంబాలకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, కర్రె సరేశ్, బండారి మల్లయ్య, కళ్లెం రమేశ్, చింత కరుణాకర్ పాల్గొన్నారు.

ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

ఖిలావరంగల్, మే 19 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఉప ఎన్నిక ఈ నెల 27న జరుగనున్న నేపథ్యలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఎల్బీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు డీఆర్వో పీ ప్రావీణ్య ఆదివారం తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఈ నెల 21 నుంచి 24 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు..

- పేరిణీ నృత్యంలో రాణిస్తున్న దీక్షిత
- తల్లి ప్రోత్సాహంతో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థిని

బచ్చన్నపేట, మే 19 : పేదరికంలో పుట్టిన అమ్మాయి పేరిణీ నృత్యంలో ప్రతిభ చూపుతోంది. పలువురి మన్ననలు, ప్రశంసలు పొందుతూ అవార్డులు, బహుమతులు అందుకుంటోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి మంజుల-కీ.శే. రమేశ్ దంపతుల కుమార్తె ఇజ్జగిరి దీక్షిత(14) మండలంలోని శ్రీరామకృష్ణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. దీక్షిత చదువులో రాణిస్తూనే పేరిణీ నృత్యంపై మక్కువ పెంచుకుంది. ఇది గమనించిన తల్లి మంజుల జనగామలో పేరిణీ నృత్య గురువు సంతోష్ దగ్గర నృత్యంపై శిక్షణ ఇప్పించారు. దీంతో దీక్షిత పాఠశాలలో, మండలంలో జరిగిన పలు వేడుకలతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబరించింది. ఈ క్రమంలోనే శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లోని శిల్పా కళా వేదికలో శ్రీ చంద్ర నిలయం వారి సారథ్యంలో నిర్వహించిన ప్రదర్శనలో దీక్షిత పాల్గొని ప్రతిభ కనబరిచింది. పలువురి మన్ననలు పొంది బహుమతి గెలుచుకుంది. ప్రోత్సహించే వారు ఉంటే చదువుతోపాటు ఇతర రంగాల్లో సైతం రాణిస్తారని దీక్షిత లాంటి విద్యార్థిని నిరూపించింది. ప్రతిభ కనబర్చిన దీక్షితను పాఠశాల యాజమాన్యం. తోటి విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రతిభ కనబర్చిన దీక్షిత

ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 19: హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహించి, జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన ఎండీ కరీం మాట్లాడుతూ అన్ని పోస్టులకు ఒక్కో నామినేషన్ మాత్రమే రాగా రాష్ట్ర ఖోఖో సంఘం పరిశీలకుడు జీవీ విలియమ్స్, ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకుడు శ్రీమన్నారాయణ, జిల్లా ఒలింపిక్ సంఘం పరిశీలకుడు కైలాస్‌యాదవ్, డీవైఎస్‌వో అశోక్‌కుమార్ సమక్షంలో ఎన్నికను ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొత్త కార్యవర్గంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జంగా రాఘవరెడ్డి, తోట శ్యాంప్రసాద్, కోశాధికారిగా గట్టుకొప్పుల సురేశ్‌ను ఎన్నుకున్నారు. జంగా మాట్లాడుతూ ఖోఖో క్రీడ 15ఏళ్లుగా ఎంతో పురోగతి సాధించిందని, రాబోయే రోజుల్లో వరంగల్ జిల్లా జట్టుతోపాటు తెలంగాణ రాష్ట్ర జట్టు జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు రూ.10లక్షలతో నెలరోజుల్లో మ్యాట్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

జంగా రాఘవరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

పదో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు

వరంగల్, మే 19 : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పదో రోజు అమ్మవారికి నిత్యాహ్నికం, చతుస్థానార్చన తర్వాత ఉదయం శరభవాహనసేవ, సాయంత్రం పుష్పరథంపై ఊరేగించారు. పదోరోజు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలు, సమర్పించారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారితో పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

భద్రకాళీ అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

'పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి'

జఫర్‌గఢ్, మే 19 : వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన విద్యావేత్త, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎండీ రియాజ్, ఉప్పుగల్లుకు చెందిన ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు నరేశ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రులకు ఉద్యోగాలు, నిరుద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును రాకేశ్‌రెడ్డికి అందించి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు బోరగాని రాజు, కౌడగాని సుధీర్‌కుమార్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రమల్లయ్య కుంటను కబ్జా నుంచి కాపాడాలి'

పాలకుర్తి, మే19: నియోజకవర్గం కేంద్రమైన పాలకుర్తిలోని ఎర్రమల్లయ్య కుంటను కబ్జా కోరల నుంచి పరిరక్షించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి జీడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎర్రమల్లయ్య కుంటలో దాదాపు 12ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి గురవుతోందన్నారు. కాందిశీకుల భూమికి వారసులమని కొందరు చెబుతూ కబ్జా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ భూమిని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కళాశాల కోసం ఉపయోగించాలని కోరారు. లేదంటే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఈటలను కలిసిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్

బచ్చన్నపేట, మే 19 : బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈటలను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఇటీవల ఓటరు అవగాహన సదస్సులు పెద్దఎత్తున నిర్వహించి పోలింగ్‌శాతం పెంచేందుకు కృషి చేశారని తెలిపారు. కరోనా సమయంలో పేదలకు సేవా కార్యక్రమాలు అందించామని, భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని నరేశ్‌కుమార్ వివరించారు.

ఈటల రాజేందర్‌కు జ్ఞాపిక అందిస్తున్న నరేశ్‌కుమార్

'పేరిణీ'లో విద్యార్థినుల ప్రతిభ

స్టేషన్ ఘన్‌పూర్, మే 19 : హైదరాబాద్‌లోని ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పేరిణీ నృత్యం, ఆంధ్రనాట్య ప్రదర్శనలో మండలానికి చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపారు. సంతోష్ పెరుమాండ్ల శిష్యరికంలో వీరంతా మూషిక వాహన పాటను ప్రదర్శించి సభికుల అభినందనలు పొందారు. అనంతరం మయూరి ఆర్ట్స్ అధినేత మయూరి రాధ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందించారు.

మెమెంటోలు అందుకుంటున్న విద్యార్థినులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జనగామ చౌరస్తా, మే 19 : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామలో జరిగింది. అర్బన్ సీఐ ఎల్ రఘుపతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ ఏరియాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఉల్లెంగుల ప్రభాకర్ (51) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకుతోడు అప్పులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో భార్య, పిల్లలు నిద్రించిన తర్వాత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు.

మహిళ మెడలోని పుస్తెల తాడు చోరీ

పాలకుర్తి, మే19: మహిళ మెడలోని పుస్తెల తాడును చోరీ చేసిన ఘటన మండలంలోని గూడూరులో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గూడూరులోని మాచర్ల గౌరమ్మ ఇంటికి శనివారం గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. మరుగు దొడ్డి తలుపులు బాగు చేస్తానని నమ్మించి ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లాడు. దీనిపై ఆదివారం బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు

రఘునాథపల్లి, మే 19: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల సరేశ్‌యాదవ్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. మండలంలోని మండెలగూడేనికి చెందిన పర్ష రాజశేఖర్, పర్ష గట్టయ్య గ్రామంలోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. దీనిని గుర్తించి వారిపై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే సహించేలేదని, ఎంతటి వారైనా శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, HAREESH KUMAR AUKARAPU, S/o. AUKARAPU RAJA CHENNA VISWESWAR, R/o. H.No. 8-11-24, R.N.T. Road, Beside Andhra Bank, Warangal, Warangal Dist.-506002, T.S., India., have Changed my name as AUKARAPU HARISH KUMAR and solemnly declare.
NTW-00

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

జనగామ చౌరస్తా : నాటి గురువులతో బీఈడీ చదివిన పూర్వ విద్యార్థులు

జనగామ రూరల్ : పెద్దపహాడ్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

రఘునాథపల్లి : కోమల్ల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జనగామ చౌరస్తా, మే 19 : రఘునాథపల్లి మండలం నిడిగొండలోని జనగామ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో బీఈడీ చదువుకున్న సవ్వడి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వివిధ వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఈ వేడుకకు తరలివచ్చారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. విద్యా బోధన చేసిన గురువులు నల్లనాగుల రాజు, దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, సుధీర్‌రెడ్డి, వినోద్, తోట రాజు, మారుతి ప్రసాద్, శ్రీహరి, రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుర్గేశం, శ్రీధర్, శ్రీధర్‌రెడ్డి, క్రాంతి, మహేందర్, సందీప్, గోవర్ధన్, ఊర్మిళ, అర్చన, కల్పన, శారద, మమత, రామకృష్ణ, రామనుజం, చారి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండలంలోని కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరం పదో తరగత